ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 22.6

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

సోమవారం 18 నవంబరు 2024

35కిలోమీటర్లు...
రెండు గంటల ప్రయాణం

● రద్దీగా మారిన జాతీయ రహదారులు
● సెలవుల అనంతరం పట్నంకు పయనం



6

మొదటి రోజు ప్రశాంతం





జిల్లా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, కోదాడలో పరీక్ష సామగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న పోలీసులు, సిబ్బంది

టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూపు-3 పరీక్షలు మొదటిరోజు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజులపాటు కొనసాగే ఈ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఒక నిమిషం నిబంధన అమల్లో ఉండడంతో కొంత మంది అభ్యర్థులు ఆలస్యంగా వచ్చి వెనుదిరిగారు.

7

భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం..





క్యూలైన్లలో భక్తుల రద్దీ, ప్రధాన ఆలయంలో ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

యాదగిరీశుడి సన్నిధి ఆదివారం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం, వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. భక్తులతో దేవస్థానం వసతి గృహాలు నిండిపోగా భక్తులు అద్దె గదుల కోసం ఇబ్బందులు పడ్డారు. బస్సు సౌకర్యం లేక తులసీ కాటేజీ చేరుకునేందుకు భక్తులు నానా తంటాలు పడ్డారు.

6



దండిగా ధాన్యం

- ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా కొనుగోళ్లు
- ఈ సీజన్‌లో 29.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- దొడ్డు రకాలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే
- సన్న ధాన్యం మాత్రం మిల్లులకు

వరి కోతలు ముమ్మరం కావడంతో ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీపావళి తరువాత నాగార్జునసాగర్ ఆయకట్టులో ఉన్న నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వరి కోతలు ఉధృతమవగా, నాన్ ఆయకట్టులో కోతలు చివరి దశకు చేరాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్ల మీద, కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన దృశ్యాలు, ధాన్యపు రాశులు, లారీలు, కాంటాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో మొత్తం 29.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనాతో ఆ మేరకు కొనుగోళ్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 12.68లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వాతావరణం అనుకూలించి సకాలంలో వర్షాలు కురవడంతో బోరుబావుల కింద కూడా ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రాజెక్టుల్లో నీరు ఉండడంతో నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ, మూసీ, ఇతర చిన్న ప్రాజెక్టుల కింద ఆయకట్టులో ధాన్యం దిగుబడి భారీగా వచ్చింది. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 29.50లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అనుకూల పరిస్థితులు ఉండడంతో సన్న రకం ధాన్యం సాగు అధికం కాగా, ఉత్పత్తి కూడా ఆ మేరకు ఉంది. సాగర్ ఆయకట్టు కింద సన్నాల సాగు ఎక్కువైంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యం 16.10లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డురకాల ధాన్యం 13.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. దొడ్డు రకాల ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే కొనుగోలు చేస్తుండగా, సన్న రకం ధాన్యం కూడా కనీసం 8లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ధారించారు. సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ కూడా ప్రభుత్వం ప్రకటించినా, సన్నాల రైతులు మాత్రం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో మిగతా 6వ పేజీలో...

రాష్ట్ర చరిత్రలో అత్యధిక ధాన్యం ఉత్పత్తి



ఉమ్మడి రాష్ట్రంలో ఏ ఏడాది రానంత ధాన్యం దిగుబడి ఈ వానాకాలంలో రాష్ట్రంలో వచ్చింది. మొత్తం రాష్ట్రంలో ఈ సీజన్‌లో 66.67లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే, 1.53కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వచ్చింది. దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ సందర్భంలో రానంత ధాన్యం ఉత్పత్తి ఈ సీజన్‌లో రావడం గర్వకారణం. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే అందులో 20 శాతం మేర ఉత్పత్తి ఉండడం అభినందనీయం. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. రైతులు పండించిన చివరి గింజ వరకు కనీస మద్దతు ధర వచ్చేలా చూస్తున్నాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో డబ్బు చెల్లించేలా ఏర్పాట్లు చేశాం.

ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి

పరీక్షలు లేవు..
పర్యవేక్షణ కానరాదు

● ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు



కోదాడలోని మాంసం మార్కెట్

ఆదివారం వచ్చిందంటే.. ముక్క లేనిదే ముద్ద దిగదు. పేద, ధనిక అని తేడా లేకుండా ప్రస్తుతం అందరూ మాంసాహారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు పండుగలు, పబ్బాలకు మాత్రమే మాంసం తెచ్చుకునే రోజులు పోయి.. ఇప్పుడు తినాలనిపిస్తే చాలు.. వారం లేదు, టైం లేదు. మార్కెట్‌కు వెళ్లి తెచ్చుకొని తినాల్సిందే. మరి ఆ మాంసం ఎలా వస్తుంది. దాని నాణ్యత ఏమిటి. శుభ్రత పాటిస్తున్నారా?, ఎవరైనా పరీక్షలు చేస్తున్నారా? అంటే లేదనే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మాంసం విక్రయ దుకాణాలు చాలా వరకు మురుగు కాల్వలు, రోడ్ల వెంట, చెత్తకుప్పల వెంబడి అపరిశుభ్రంగా ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మాంసం మార్కెట్ల కొరత మూలాన ఎక్కడపడితే అక్కడ జంతువులను వధిస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి, దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లోని మాంసం విక్రయాలపై 'ఆంధ్రజ్యోతి' విజిట్..



6

న్యూస్ బాక్స్

నేడు బీసీ కమిషన్ బృందం రాక

నల్లగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, గౌరవ సభ్యుల బృందం సోమవారం నల్లగొండకు రానున్నట్టు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వెనకబడిన తరగతుల సామాజిక, విద్యాపరంగా స్థితిగతులను తెలుసుకునేందుకు, వారి ఆర్థిక ప్రయోజనాలు పెంపొందించే దిశగా వృత్తుల అధ్యయనం చేసి నిధుల కేటాయింపునకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కమిషన్ నిర్ణయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బహిరంగ విచారణ నిర్వహించేందుకు నల్లగొండలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్, సభ్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బీసీ వర్గాలు, ప్రజలు వ్యక్తిగతంగా కలిసి దరఖాస్తులు, సమాచారం, అఫిడవిట్‌తోపాటు ఆరు సెట్లు కమిషన్‌కు అందజేయాలని కోరారు.

మట్టపల్లివాసుడికి వైభవంగా పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో స్వామికి ఆదివారం విశేష పూజలు వైభవంగా కొనసాగాయి. ఆలయంలో ప్రాత:కాలార్చనలు పూర్తయ్యాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణ అనంతరం స్తంభోద్భవుడికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమం చేశారు. అనంతరం క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం అర్జిత కైంకర్యాలు కొనసాగాయి. కల్యాణ మూర్తులను పరిణవేదికపై అధిష్ఠింపజేసి నిత్య కల్యాణం నిర్వహించారు.

మైన్స్ నిర్వహణలో మైహోంకు ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న డీజీఎం అప్పలరాజు

మేళ్లచెర్వు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మైహోం సంస్థ నిర్వహిస్తున్న సున్నపురాయి గనుల్లో వేపలమాదారం గనులకు రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ బహుమతి వరించింది. రెండు తెలుగు రాష్ట్రాల 39వ సున్నపురాయి గనుల భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశం శనివారం రాత్రి విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్, ఐఏఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కాగా, రాష్ట్ర వ్యాప్తంగా మైహోం నిర్వహించే వేపలమాదారం మైన్స్‌కు ప్రథమ బహుమతి, చౌటపల్లి మైన్స్‌కు తృతీయ బహుమతి సొంతమయ్యాయి. బహుమతులను ప్రవీణ్‌కుమార్ నుంచి మైహోం సంస్థ మైన్స్ డీజీఎం అప్పలరాజు, ఏజీయం నరేష్ అందుకున్నారు. మైహోం ప్రెసిడెంట్ యస్. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

సోయాబీన్ సేకరణలో దేశంలోనే మొదటిస్థానం

● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ● టేకుమట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



టేకుమట్లలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

సూర్యాపేటరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోయాబీన్ సేకరణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని, వరి ధాన్యం ఉత్పత్తిలో కూడా రాష్ట్రం ముందుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మం వెళ్తూ సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం పరిధిలోని టేకుమట్ల గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడ రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి ఎంత దిగుబడి వస్తుంది అని రైతులను అడగ్గా, 40 బస్తాల పైచిలుకు వచ్చిందని చెప్పారు. బహిరంగ మార్కెట్లో కూడా ధాన్యానికి మంచి ధర వస్తుందన్నారు. తేమశాతం చూడకుండా మద్దతు ధర, బోనస్ కంటే మిల్లర్లు ఎక్కువ ధర పెట్టడంతో కొంత మంది రైతులు మిల్లర్లకు ధాన్యం అమ్ముకుంటున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి ప్రభుత్వం సేకరించే ధాన్యం గోదాముల్లో నిల్వ ఉంచి అవసరాలకు తగ్గట్టుగా బియ్యం పట్టిస్తామని, అప్పటిదాకా ధాన్యం రంగు మారకుండా ఉండటానికే 17శాతం తేమ నిబంధన ఉందన్నారు. మన రాష్ట్ర ప్రజలకే నాణ్యమైన బియ్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా అందించడానికి ఆ నిబంధన పాటిస్తున్నట్లు చెప్పారు. వరి కొయ్యలు తగలబెట్టడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వ్యవసాయ శాఖ డైరక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వ్యవసాయశాఖ తరఫున వచ్చే 15రోజుల్లో వరి కొయ్యలు దహనం చేస్తే వచ్చే అనర్థాలపై అవగహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ నెల 16న ఒక్కరోజే 1,48,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ఇప్పటిదాకా 1,64,191 టన్నుల పత్తిని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.సోమయ్య

సూర్యాపేట టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏలను వెంటనే ప్రకటించాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ గ్రాట్యూటుడ్ సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్ మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా రెండోవిడత ఓటరు నమోదుకు ఈ నెల 23నుంచి నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకటయ్య, ఎన్.నాగేశ్వర్‌రావు, ఆడెం, కె.జ్యోతి, బాలసైదిరెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసాచారి తదితరులు ఉన్నారు.

మేళ్లచెర్వు శివాలయంలో వేద పారాయణం

మేళ్లచెర్వు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం బహుళ విజయ పర్వదినం సందర్భంగా ఆదివారం వేదపారాయణం, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. వేకువజామున ఐదు గంటల నుంచి స్వామి వారికి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకాల అనంతరం భక్తుల అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం ఉదయం 10 గంటల నుంచి దుర్వాకుల కుమారశర్మ, శిష్య బృందం వేదపారాయణం నిర్వహించింది. అనంతరం లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కనులపండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండారెడ్డి, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కమతం శ్రీనివాసరావు, చందర్‌రావు, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



లక్ష బిల్వార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

రోజుకు అర అడుగు

● వేగంగా తగ్గుతున్న నాగార్జునసాగర్ నీటి మట్టం
● ప్రస్తుతం 584.90 అడుగులు



7

పరీక్షలు లేవు.. పర్యవేక్షణ కానరాదు

● ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు ● కొరవడిన వెటర్నరీ, మునిసిపల్ అధికారుల తనిఖీలు ● రోడ్ల పక్కన, వీధుల్లో మటన్, చికెన్ దుకాణాలు

పట్టణ ప్రాంతాల్లో మాంసం విక్రయాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. దీనికి తగ్గట్టు జంతు వధశాలలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఎక్కడ పడితే అక్కడే జంతువులను వధించి మాంసం విక్రయిస్తున్నారు. పశు వైద్యాధికారి పరిశీలించి ధ్రువీకరించి ముద్ర వేయాల్సి ఉన్నప్పటికీ ఆ నిబంధనలు పాటించడం లేదు. మాంసం మార్కెట్లు లేకపోవడంతో రోడ్లు, మురుగు కాల్వల పక్కనే విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో దుమ్మూ, ధూళితో పాటు దుర్వాసన వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఆదివారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకుంది.

మిర్యాలగూడ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్, రైతు బజార్, మేదరి కాలనీల్లో 2019 కంటే ముందు నాన్‌వెజ్ విక్రయించేవారు. లాక్‌డౌన్‌తో నాన్‌వెజ్ విక్రయాలు తగ్గిపోయాయి. రెండు సంవత్సరాల తర్వాత పట్టణంలో గల్లీకో దుకాణం, ప్రతి కాలనీకో మార్కెట్, చౌరస్తాకో అడ్డా ఉంది. దాదాపు జిల్లాలోని మునిసిపాలిటీల్లో ఇదే పరిస్థితి ఉంది.


మిర్యాలగూడలో చేపల విక్రయాలు

నిర్లక్ష్యపు నీడలో.. నిధుల కొరతతో..

మిర్యాలగూడ పట్టణంలో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్లక్ష్యపు గోడలతో నిలిచిపోయింది. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులోని మినీ రవీంద్రభారతి పక్కన మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.5కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. రూ.80లక్షలతో తొలిదశ పనులు జరిగాయి. మిగితా నిధులు అందక పనులు నిలిచిపోయాయి. మలి విడతలో రూ.1.50కోట్లు మంజూరు కాగా చకచకా జరిగిన పనులు 2022లో రెండో అంతస్తు వరకు వేసిన పిల్లర్లతో నిలిచిపోయాయి. రూ.2కోట్ల నిధులతో అత్యాధునిక జంతు వధశాల నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధుల కొరతతో స్లాటర్ హౌస్ పనులు ముందుకు సాగలేదు. దశాబ్ద కాలం క్రితం షాబూనగర్‌లో నిర్మించిన జంతు వధ శాల ఉపయోగంలోకి రాలేదు. అందులోని ఫర్నిచర్, లైట్లు, స్టీల్, తలుపులు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

రోడ్లపైనే విక్రయాలు

పట్టణంలో మటన్, చికెన్, చేపల విక్రయాలు రహదారుల పక్కనే సాగుతున్నాయి. మాంసం వ్యర్థాల దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడు తున్నారు. గణేష్‌మార్కెట్, రైతుబజార్, ఖమ్మం రోడ్, చైతన్యనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో రహదారుల వెంట సాగిస్తున్న మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరు వ్యాపారులు తాజా మాంసమంటూ రోడ్లపైనే పశువుల (గొర్ల)ను కట్టివేయడం, వినియోగదారుల ముందే వాటిని వధించడంతో రహదారులు జంతురక్తంతో నిండుతున్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుటే ఇలా జరుగుతున్నా అధికారులకు పట్టింపులేదని స్థానికులు వాపోతున్నారు.


నిర్మాణ దశలోనే ఉన్న ఆధునిక వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం

ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం



నాణ్యతా ప్రమాణాలు పాటించని మాంసం వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై జంతు వధ చేయడం, అపరిశుభ్ర వాతావరణం కల్పించడం సరికాదు. పట్టణంలో నిర్మాణ దశలో నిలిచిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ విషయాన్ని ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

● ఎండీ. యూసుఫ్, మునిసిపల్ కమిషనర్ మిర్యాలగూడ .

కొరవడిన వెటర్నరీ, మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ


భువనగిరి జిల్లాకేంద్రంలో మాంసం విక్రయాల స్టాల్స్

భువనగిరి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మటన్, చికెన్, చేపల దుకాణాలపై వెటర్నరీ, మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. భువనగిరి పట్టణంలో గొర్రెల, మేకలకు సంబంధించి కబేళా దాదాపు 15సంవత్సరాల నుంచి మూతబడింది. పట్టణంలో 25 మటన్ దుకాణాలు, 60కి పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తా, పాత బస్టాండ్, సమద్‌చౌరస్తాల్లో ఎనిమిది చేపల విక్రయ కేంద్రాలున్నాయి. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి ఎదురుగా ఉన్న కబేళా చుట్టూ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతుండడంతో స్థానికులు కబేళా నిర్వహణకు అభ్యంతరం తెలపడంతో 15 సంవత్సరాల నుంచి మటన్ విక్రయదారులు తమ ఇళ్ల వద్దనే మేకలు, గొర్రెలు కోస్తూ ప్రధాన రహదారుల పక్కన తాత్కాలికంగా వేసుకున్న షెడ్డులోకి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఆర్బీనగర్ వద్ద తొమ్మిది మునిసిపల్ మడిగెలకు సంబంధించిన స్టాల్స్ ఉన్నా అక్కడ విద్యుత్, నీటి సౌకర్యం లేదు.

ఆరోగ్య సూత్రాలు పాటించకుండానే...

జిల్లాకేంద్రంలో మాంసం, చికెన్ విక్రయాలు రోడ్డు పక్కనే నిర్వహించడం వాహనాల ద్వారా వెదజల్లే కాలుష్యం, రోడ్డుపైన దుమ్మూధూళితో మాంసంపై చేరు తోంది. గొర్రెలు, మేకలు ఆరోగ్యవంతంగా ఉన్నట్లు పశువైద్యాధికారి నిర్ధారించిన తర్వాతే మునిసిపల్ అధికారులు ముద్ర వేసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాకేంద్రంలో కబేళా నిర్మాణం చేప ట్టాలని ప్రజలు కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నాన్‌వెజ్ మార్కెట్ విక్రయాల కోసం రూ.3కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నాణ్యమైన మటన్, చికెన్ అందుబాటులో ఉంచాలి



భువనగిరిలో కబేళాను ఏర్పాటు చేసి అక్కడే ఆరోగ్యమైన మేకలు, గొర్రెలను వధించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. మటన్, చికెన్ విక్రయ షాపులను తరుచూ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలి. సంబంధిత షాపులలో, ఆవరణలు, పరిశుభ్రంగా ఉండే విధంగా మునిసిపల్ అధికారులు పర్యవేక్షించాలి. వినియోగదారులకు నాణ్యమైన మటన్, చికెన్ అందుబాటులో ఉంచాలి.

● వెన్ను బింధు భార్గవి, భువనగిరి, వినియోగదారురాలు.

దుర్గంధ భరితంగా మాంసం మార్కెట్


హుజూర్‌నగర్‌లోని లింగగిరిలో రోడ్డు పక్కన మాంసం విక్రయాలు

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ పట్టణంలో రోడ్ల వెంట మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. గోవిందాపురం, అంబేడ్కర్ కాలనీ, మిర్యాలగూడ రోడ్డు, సీతారాంనగర్, మల్లన్ననగర్, కొత్తబస్టాండ్ ఎదురుగా, చింతలబజార్, మట్టపల్లి బైపాస్‌రోడ్డు, లింగగిరిరోడ్డు, మటన్ మార్కెట్ బజార్, ఫిష్ మార్కెట్ బజార్‌లో ఎక్కడ పడితే అక్కడ గొర్రెలు, మేకలను కోసి విక్రయిస్తున్నారు. లింగగిరి రోడ్డులోని ఏరియా ఆస్పత్రి ఎదుట మటన్ మార్కెట్ బజార్ ఏర్పాటుచేసి మాంసం విక్రయిస్తున్నారు. గల్లీకో దుకాణం చొప్పున వంద చోట్ల మాంసం విక్రయిస్తున్నారు. రోడ్ల వెంట వచ్చే వాహనాల దుమ్ము మాంసంపై పడుతుంది. ఫిష్ మార్కెట్‌లో అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడింది. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు ఎలాంటి పరీక్షలు చేయకుండానే మేకలు, గొర్రెలను కోసి మాంసం అమ్ముతున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యులు, మునిసిపాలిటీ అధికారులకు సంబంధం లేకుండా పదుల సంఖ్యలో గొర్రెలు కోసి మాంసం విక్రయిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

కానరాని పరిశుభ్రత

నల్లగొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలో మాంసం దుకాణాల్లో పరిశుభ్రత లోపించింది. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వెంట కనీస జాగ్రత్తలు పాటించకుండా విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. నాలుగు నెలల క్రితం మటన్ మార్కెట్ ప్రారంభించారు. లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ అవి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో మటన్ వ్యాపారులు రోడ్ల వెంట ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. దుమ్ము, దూళి రాకుండా ఎలాంటి చర్యలు తీసు కోవడం లేదు. వ్యాపారుల కోసే జంతువులను నిర్ధారిం చాల్సిన అధి కారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చికెన్ దుకాణాల్లో ఏమాత్రం కూడా పరిశుభ్రత కనిపించడం లేదు. చేపలు విక్రయించేందుకు ప్రత్యేకంగా మార్కెట్ ఉన్నా వినియోగం అంతంత మాత్రమే. పాన గల్ బైపాస్ రోడ్డు వెంట చేపలు విక్రయిస్తున్నారు. చేపల వ్యర్థాలతో ఆ ప్రాంతం పరిశుభ్రత లోపిస్తోంది.

భయం.. భయంగా



ఆలేరు రూరల్, నవం బరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సూత్రాలు పాటించకుండా మాంసం విక్రయిస్తుండడంతో అనారోగ్యం బారిన పడాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో రోడ్డు పక్కనే మాంసం, చేపలు, చికెన్ విక్రయ కేంద్రాలున్నాయి. వాహనాలు వెళ్తుండడంతో పొగ, దుమ్మూ, దూళి చేరి జబ్బుల పాలవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పశువైద్యాధికారులు పరీక్షించిన తర్వాతే ఆరోగ్యవంతమైన మేకలను కోసేందుకు మునిసిపల్ అధికారులు అనుమతించాల్సి ఉంటుందని, ఇవి పాటించకుండానే యథేచ్ఛగా విక్రయాలు కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రత్యేక షాపులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


సూర్యాపేటలో అధ్వానంగా ఉన్న ఫిష్ మార్కెట్ బజార్

'పేట'లో పరీక్షలు లేని మటన్

భానుపురి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో మటన్, చికెన్, చేపల విక్రయాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది. కబేళా(పాత భవనం) శిథిలావస్థకు చేరడంతో మూసేశారు. గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉన్నాయా లేవా చూడాల్సిన అధికారులు సైతం రెండు వారాల నుంచి పరీక్ష చేయడం మానేశారు. పరీక్షలు ఎక్కడ చేయాలో తెలియక పశువైద్యాధికారులు కూడా మిన్నకుంటున్నారు. కబేళా భవనంలో నల్లాలు, లైట్లు, కుర్చీలు లేవు. పాత భవనం కూలిపోయే దశలో ఉందని కబేళాను వాడడం మానేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గొర్రెలు, మేకలను పరీక్షించిన తర్వాత కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.

ఎక్కడ పడితే అక్కడే విక్రయాలు

ఎక్కడపడితే అక్కడ మటన్, చికెన్ దుకాణాలు వెలుస్తున్నాయి. వీటిపైన పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎప్పుడో ఒకసారి పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో పుల్లారెడ్డిచెరువు పక్కన ఉన్న కబేళా భవనం మరమ్మతులకు గురికావడంతో రెండు వారాల నుంచి తెరవడం లేదు. కొత్త భవనం నిర్మించాలని ప్రతిపాదనలు పంపినట్లు మునిసిపాలిటీ అధికారులు చెబుతున్నారు. జిల్లాకేంద్రంలోని కుడకుడ రోడ్డు, జనగాం క్రాస్‌రోడ్డు, రాజీవ్‌నగర్, పాత మార్కెట్ రోడ్డు, ఇతర ప్రాంతాల్లో మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు.

● మున్సిపాలిటీలో 55 మటన్ దుకాణాలు, 77 చికెన్ దుకాణాలు, 10 చేపల దుకాణాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఒక్కో దుకాణానికి సంవత్సరానికి రూ.500 చొప్పున మునిసిపాలిటీకి చెల్లిస్తున్నారు. దుకాణాలు ఉన్నచోట పరిశుభ్రత లోపించిందని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే మున్సిపాలిటీ సిబ్బంది అక్కడికి వెళ్లి శుభ్రం చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

● సూర్యాపేటలోని అలంకార్ థియేటర్ పక్క సందులో చేపల విక్రయాలు కొనసాగిస్తున్నారు. చేపలు కోసిన తర్వాల వ్యర్థాలతో రోడ్డంతా అపరిశుభ్రంగా మారుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. చేపలు కడిగిన నీరంతా మురుగు కాల్వలోకి వెళ్తుంది. ఒక్కోసారి రోడ్డుపైనే పారుతుంది. రెండు రోజుల వరకు ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. మునిసిపాలిటీ వాహనాలు వచ్చే వరకు చేపల పొట్టు, పేగులు ఆ ప్రాంతంలోనే ఉండడంతో ఆ రోడ్డు వెంట వెళ్లడం కష్టమవుతోందని స్థానికులు వాపోతున్నారు. చికెన్ దుకాణదారులు సైతం మురుగుకాల్వలు ఉన్నచోట కాల్వలోకి కడిగిన నీటిని వదులుతున్నారు. డబ్బాలు, బస్తాల్లో వ్యర్థాలను నిల్వ ఉంచి మునిసిపాలిటీ వాహనం వచ్చినప్పుడు అందిస్తున్నారు.

పరిశుభ్రంగా ఉంచుతున్నాం

జిల్లాకేంద్రంలో మటన్, చికెన్, చేపక దుకాణాదారులకు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు ఇస్తాం. మునిసిపాలిటీ వాహనాల ద్వారా జంతువుల వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నాం. కబేళా భవనం మరమ్మతులకు వచ్చింది. కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపించాం.

● శ్రీనివాస్, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్.

దేవరకొండలో ఇష్టానుసారంగా విక్రయాలు

దేవరకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలోని గాంధీబజార్, కూరగాయల బజార్ సెంటర్లలో మేకలు, గొర్రెల మాంసం విక్రయిస్తున్నారు. దేవరకొండలో నాన్‌వెజిటేరియన్ మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టమొచ్చిన ప్రదేశాల్లో, రోడ్లపై దుమ్ము, దూళీ ఉన్నా అక్కడే మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. చేపల మార్కెట్ కూడా లేకపోవడంతో వ్యాపారులు పాత కూరగాయల మార్కెట్, రోడ్లపైనే చేపలను కోసి విక్రయిస్తున్నారు. దీంతో దుమ్ము, దూళి చేరే ప్రమాదముందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైజాగ్‌కాలనీ, వివిధ చెరువుల్లో పట్టిన చేపలను కిలో రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.


దేవరకొండలో రోడ్డు పక్కనే మాంసం విక్రయాలు

నిబంధనలు పాటించకుండా..



కోదాడటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కోదాడ పట్టణంలోని రోడ్ల వెంటే మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. నిబంధనలు అమలు చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులకు నాణ్యమైన మాంసం దొరకడం లేదు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దండిగా ధాన్యం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం వేగం పెంచింది. కేంద్రాలన్నీ తెరవడంతోపాటు ఎక్కడికక్కడ ధాన్యం ఆగకుండా చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ దాదాపు 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. సన్న ధాన్యం మాత్రం మిల్ పాయింట్‌లకు వెళ్తోంది.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్లు నిత్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీచేస్తున్నారు.

ఫిర్యాదులు వస్తే వెంటనే అధికారులను అప్రమత్తం చేస్తూ కొనుగోళ్లు, రవాణా, కాంటాల విషయంలో జాప్యం లేకుండా చూస్తున్నారు. నిత్యం 1,000కి పైగా లారీల్లో ధాన్యం గోదాములకు తరలుతోంది. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల నుంచి గరిష్ఠంగా వారంలోగా డబ్బు చెల్లిస్తున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు రూ.400 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.110కోట్లు చెల్లించారు.

4లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుచేసిన మిల్లర్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్న ధాన్యమే అధికంగా వస్తోంది. ఈ ధాన్యాన్ని మిల్లుల వద్ద తేమ శాతంతో సంబంధం లేకుండా మిల్లర్లు కొనుగోలుచేస్తుండగా, ధర తక్కువ రావడంతోపాటు బోనస్‌ను రైతులు కోల్పోతున్నారు. అయినా రైతులు మిల్లుల వద్దనే ధాన్యాన్ని అధికంగా విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మిల్ పాయింట్ల వద్ద ఇప్పటివరకు 4.50లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు కొనుగోళ్లు జరిగాయి. మిల్లుల వద్ద కింటాకు రూ.2,100 నుంచి రూ.2,200 ధర చెల్లిస్తుండగా, గరిష్ఠంగా క్వింటాకు రూ.2,350 నుంచి రూ.2,400 చెల్లిస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో..

జిల్లాలో ఈ సీజన్‌లో 346 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 80 సన్న కేంద్రాలు సన్నధాన్యం కోసం కేటాయించారు. ఇప్పటి వరకు 1,00,869 క్వింటాళ్ల దొడ్డు ధాన్యం కొనుగోలు చేయగా, 346 క్వింటాళ్ల సన్న ధాన్యం కొనుగోలు చేశారు.

● సూర్యాపేట జిల్లాలో 311 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దొడ్డు రకాల ధాన్యం 44,479 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. సన్న ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులు మిల్లులకే విక్రయించారు.

భక్తజనసంద్రం.. యాదగిరి క్షేత్రం

● ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి 2 గంటల సమయం ● స్వామివారి నిత్యం ఆదాయం రూ.64,26,176


ఆలయంలో సుదర్శ నారసింహ హోమం నిర్వహిస్తున్న పూజారులు

భువనగిరి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్యక్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. కార్తీక మాసం, వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. భక్తులతో దేవస్థానం వసతి గృహాలు నిండిపోగా భక్తులు అద్దె గదుల కోసం ఇబ్బందులు పడ్డారు. బస్సు సౌకర్యం లేక తులసీ కాటేజీకి చేరుకునేందుకు భక్తులు నానా తంటాలు పడ్డారు. రద్దీకి అనుగుణంగా అధికారులు ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేసి కొండపైకి, కిందకు తరలించారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఆలయంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆరు విడతల్లో సత్యదేవుడి వ్రతాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన స్థలాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. మొత్తం 1,220 మంది జంటలు వ్రతం చేయించుకున్నారు. కిండపైన గర్భాలయంలో పంచనారసింహాలతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మ దర్శనాలకు రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. 52వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, క్యూకాంప్లెక్స్‌లతోపాటు ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణకట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.64,26,176 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని అసోంలోని గౌహతి హైకోర్టు న్యాయమూర్తి మిథాలి ఠాకూరియా దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.


తూర్పు రాజగోపురం వద్ద భక్తుల సందడి

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు.

పల్లెటూళ్ల నుంచి పట్నం వైపు వాహనాలు

● 35కిలోమీటర్లు.. రెండు గంటల ప్రయాణం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. ఆదివారం పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు పెద్దసంఖ్యలో ఉండడంతో హైవేపై వాహనాల రాకపోకలు పెరిగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లలో నోములకు విచ్చేసిన ప్రజలు సైతం తిరుగుముఖం పట్టారు. దీంతో ప్రధానంగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ కు వెళ్లే మార్గం వాహనాలతో నిండిపోయింది. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో సైతం ప్రజలు కిక్కిరిసి వెళ్లారు. చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం పట్టణాల్లో కంఠమహేశ్వర స్వామి బోనాల పండుగ ఉండడంతో గౌడ కులస్తుల ఇళ్లు బంధు, మిత్రులతో నిండిపోయాయి. వందల సంఖ్యలో కార్లు, ద్విచక్రవాహనాలతో వీధులు నిండిపోయాయి. పెళ్లిళ్లతో ఫంక్షన్ హాల్స్ కిటకిట లాడాయి. చౌటుప్పల్ నుంచి హైదరాబాద్‌లోని వనస్థలిపురం వరకు కారులో 35 కి.మీటర్లు వెళ్లేందుకు రెండు గంటల సమయం పట్టిందని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ తెలిపారు. ఇది ఇలా ఉండగా, జాతీయ రహదారిపై పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ట్రాఫిక్ జాం కాకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

రోజుకు అర అడుగు

- వేగంగా తగ్గుతున్న సాగర్ నీటి మట్టం
- ప్రస్తుతం 584.90 అడుగులు



నాగార్జునసాగర్ జలాశయం

నాగార్జునసాగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా తగ్గుతుంది. గురువారం 586.20 అడుగులుగా ఉన్న నీటి మట్టం 0.50 అడుగులు (అర అడుగు) తగ్గి శుక్రవారం సాయంత్రానికి 585.80 అడుగు చేరుకుంది. శనివారం సాయంత్రానికి మరో అర అడుగు తగ్గి 585.30 అడుగులకు చేరుకుంది. ఆదివారం సాయంత్రానికి మరో అర అడుగు తగ్గి 584.80 అడుగులకు చేరుకుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి 584.80 అడుగులకు చేరుకుంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయడంతో ఎగువ నుంచి సాగర్‌కు ఎటువంటి నీటి రాక లేదు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 584.90 అడుగులు (297.1465 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9900 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 5510 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. సాగర్ నుంచి మొత్తం 18,110 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు.

పులిచింతలకు తగ్గిన ఇన్‌ఫ్లో

మేళ్లచెర్వు: ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు (45.77టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 173.09 అడుగులు (42.86 టీఎంసీలు)గా నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8,545 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుండగా తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 8545 క్యూసెక్కులుగా ఉంది.

మూసీ ఒక గేటుతో నీటి విడుదల

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోనూ వర్షాలు లేకున్నా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా వస్తుంది. దీంతో 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.60 అడుగులు(4.36టీఎంసీ)లకు చేరింది. దీంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు 3వ నెంబరు క్రస్టుగేటును అర అడుగు మేర ఎత్తి 331.94 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. మరోవైపు శనివారం సాయంత్రానికి 662.26 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి 376.42 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు గేటును అర అడుగు ఎత్తడం ద్వారా 331.94 క్యూసెక్కులు, ఆవిరి, సీపేజీ, లీకేజీల రూపంలో వెళ్తున్న 44.48 క్యూసెక్కులు కలిపి మొత్తం 376.42 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతుంది.



నీటితో నిండుకుండలా ఉన్న మూసీ రిజర్వాయర్

సాగర్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత

- ఈ ఏడాది లక్ష్యాన్ని దాటిన ఉత్పత్తి
- కేఆర్ఎంబీ ఆదేశాలు అమలు



నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం


నాగార్జునసాగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ఆదివారం ఉదయం నుంచి నిలిపివేశారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశాలతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని జూలై 24వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1400 మిలియన్ యూనిట్లు కాగా మూడు నెలల్లో అక్టోబరు 22వ తేదీ మధ్యాహ్నం నాటికి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నట్లు సీఈ తెలిపారు. గతేడాది సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని (గత ఏడాది లక్ష్యం 1530 మి.యూ) చేరుకోలేదు. ఈ ఏడాది ఈ ఆర్థిక సంవత్సరంలో (ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు) జూన్ మొదటి వారంలో సాగర్‌కు నీటి రాక లేనందున విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. జూలై 24వ తేదీ నుంచి ఎగువ నుంచి సాగర్‌కు వరద రాక ప్రారంభమవడంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 8టర్బైన్లు ఉండగా ఒక్కొక్క టర్బైన్ నుంచి 110 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అందులో 2వ నంబరు టర్బైన్ గత ఏడాది కాలంగా మరమ్మతులకు గురైంది. దీంతో ప్రస్తుతం 7 టర్బైన్ల ద్వారా మాత్రమే విద్యుత్‌ను ఉత్పత్తి చేసినా మూడు నెలల కాలంలో లక్ష్యాన్ని చేరుకున్నామని సీఈ పేర్కొన్నారు.

ఐదేళ్లలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి వివరాలు మిలియన్ యూనిట్లలో...

నీటి ఏడాది	లక్ష్యం	ఉత్పత్తి
2019-20	1289	1512.85
2020-21	1290	1248.78
2021-22	1535	2262.62
2022-23	1500	2355.63
2023-24	1530	540.83
2024-25	1400	1657.19

(జూలై 24 నుంచి నవంబరు 16వ తేదీ వరకు)

కేఆర్ఎంబీ ఆదేశాలతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశాం



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో కేఆర్ఎంబీ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశాం. సాగర్‌లో ఉన్న నీటిని తాగు, సాగు నీటి అవసరాలకు ఉపయోగించాలని కేఆర్ఎంబీ సూచించింది. అంతే కాకుండా ప్రాజెక్టుకు భారీ వరదలు వస్తున్నప్పుడే నిరంతరాయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని జెన్‌కోకు బోర్డు సూచించింది. విద్యుత్ అవసరాన్ని బట్టి కేఆర్ఎంబీ అనుమతులతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తాం.

● మంగేష్‌కుమార్, సీఈ, జెన్‌కో

ప్రశాంతంగా గ్రూప్ -3 పరీక్షలు

- ఉదయం, సాయంత్రం వేళల్లో పరీక్షల నిర్వహణ
- సమయానికి రాని అభ్యర్థులను వెనక్కి పంపిన అధికారులు



పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు బారులుదీరిన అభ్యర్థులు

నల్లగొండ, మిర్యాలగూడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్ల గొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పరీక్షలను నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్షను నిర్వహించారు. సాయంత్రం 3 నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 హిస్టరీ, పొలిటికల్ అండ్ సొసైటీ పరీక్షను నిర్వహించారు. పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల సమీపంలో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే ముందు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించారు. నిర్దేశించిన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోని అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో కి అనుమతించలేదు. దీంతో కొంత మంది అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు. సోమవారం ఉదయం గ్రూప్-3 పరీక్ష ఒకటి నిర్వహించనున్నారు. ఈ పరీక్షతో గ్రూప్-3 పరీక్షలు పూర్తి కానున్నాయి. గ్రూప్-3 పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్షలకు దాదాపు సగం మంది మాత్రమే హాజరవడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయి తే త్వరలోనే గ్రూప్-2 పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ఆ గ్రూప్-2 పరీక్షలు రాసేందుకే మొగ్గు చూపుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

● నల్లగొండ, మిర్యాలగూడలో మొత్తం 88 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. 28,353 మంది అభ్యర్థులకు ఉదయం 15,459 మంది హాజరు కాగా, 12,894 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 15,392 మంది హాజరుకాగా, 12,961 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీచేశారు. సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాల, డాన్‌బోస్కో, ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చే సిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్జీ కళాశాలలో ఏర్పా టు చేసిన స్ట్రాంగ్‌రూంను తనిఖీ చేశారు. మిర్యాలగూడలోని పలు పరీక్ష కేంద్రాలను సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఎస్పీ రాజశేఖరరాజు, తహసీల్దార్ హరిబాబు, మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ తనిఖీ చేశారు. కా గా, పరీక్షల సందర్భంగా వచ్చిన అభ్యర్థులతో ఆర్టీసీ బస్టాండ్లు, టిఫిన్ సెంటర్లు, భోజన హోటళ్లు రద్దీగా కనిపించాయి.

సూర్యాపేటలో...

సూర్యాపేట(కలెక్టరేట్), కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షకు 16543 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 9178 మంది హా జరు కాగా 7365 మంది గైర్హాజరయ్యారు. సాయంత్రం నిర్వహించిన పేపర్-2 పరీక్షకు 9173 మంది హాజరు కాగా 7370 మంది అభ్యర్థులు హాజరుకాలేదు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వేర్వేరుగా పరిశీలించారు. పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూంకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

● కోదాడ పట్టణంలో 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో సూర్యనారాయణ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 7592 మంది విద్యార్థులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉదయం 3,124 మంది, రెండో పేపర్‌కు 3,132 మంది హాజరైనట్లు తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో...

భువనగిరి రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లాలో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కేంద్రం, భువనగిరి పట్టణ, మండలంలో ఏర్పాటు చేసిన 15 పరీక్ష కేం ద్రాల్లో 6043 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంది. పేపర్ 1కు 3098మంది మాత్రమే హాజరయ్యారు. పేపర్ 2 పరీక్షకు 3094మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. జిల్లాలోని 15 పరీక్ష కేంద్రాల ఆవరణలో పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ హనుమంతరావు, స్థానిక సంస్థల అడిషినల్ కలెక్టర్ కె. గంగాధర్, భువనగిరి ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఫ్లయింగ్ స్క్వా డ్‌తో పాటు పలువురు అధికారులు సందర్శించారు.

పరీక్ష కేంద్రాల చిరునామా తికమక

- అభ్యర్థుల ఇబ్బందులు



భువనగిరి: ఆర్డీవో కృష్ణారెడ్డితో మాట్లాడుతున్న అభ్యర్థులు

భువనగిరి రూరల్: భువనగిరి జిల్లా కేంద్రంలోని కృషి ఐటీఐ ప్రాంగణంలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో కృషి ఐటీ ఐ, సాయికృప డిగ్రీ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలకు సంబంధించిన 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే హాల్ టికెట్లలో అదే ప్రాంగణానికి సంబంధించి వేర్వేరుగా అడ్రస్‌లు ఉండటంతో అభ్యర్థులు అయోమయానికి గురై పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు ఆలస్యమైంది. అయితే ఉదయం 9.30 గంటలకు ఆ కేంద్రానికి వచ్చిన అభ్యర్థులందరినీ లోనికి అనుమతించారు. చిరునామా తెలియక ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు అధికారులు నిరాకరించారు. అదే సమయంలో పరీక్ష నిర్వహణను పరిశీలించేందుకు వచ్చి న ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డిని పలువురు అభ్యర్థులు బతిమాలినా నిబంధనల మేరకు లోనికి అనుమతి లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో అభ్యర్థులు వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలలోపే పరీక్ష కేంద్రంలోనికి అనుమతి నిబంధన ఉందని, ఈ విషయమై పలుమార్లు సూచించినట్లు పేర్కొన్నారు. పది రోజుల ముందే హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని వెసులుబాటుతో పాటు ఒక్క రోజు ముందే కేంద్రాలను సందర్శించుకోవాలని పలు ప్రకటనలు కూడా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమయపాలన పాటించకపోవడం వల్లే అభ్యర్థులను లోనికి అనుమతించేందుకు నిరాకరించారని స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.122	190	220
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.130	290	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	585.00
టీఎంసీలు	297.4350
ఎడమకాల్వకు నీటి విడుదల	5,510
కుడికాల్వకు	9900
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	18,110 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.86 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,545 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	0
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.60 అడుగులు
టీఎంసీలు	4.36
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	376.42 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	376.42 క్యూసెక్కులు



నల్లగొండ జిల్లాకేంద్రంలోని డాన్‌బాస్కో కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మిర్యాలగూడఅర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కిష్టాపురం వద్ద ఆదివారం జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన గౌని యాదగిరి (59) వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం తన ద్విచక్రవాహనంపై వ్యక్తి మిర్యాలగూడకు వెళ్తుండగా మార్గమధ్యలో కిష్టాపురం వద్ద అద్దంకి - నార్కట్‌పల్లి రోడ్డుపై అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాదగిరిని మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు యాదగిరికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మాహత్యాయత్నం

- వాగ్మూలం సేకరించిన న్యాయమూర్తి
- కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భూ, ఆర్థిక సమస్యలకు తోడు కుటుంబ వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటినాయక్ తండాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోటినాయక్ తండాకు ధరావత్ హుస్సేన్, అతని బాబాయి ధరావత్ మంగ్య ఇద్దరు కలిపి తండాలో కేబుల్ నిర్వహిస్తున్నారు. కేబుల్ నిర్వహణ ఒక్కో ఏడాది ఒకరు చూసుకోవాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ధరావత్ మంగ్య ఆయన భార్య మంగమ్మ సర్పంచ్‌గా పనిచేశారు. కేబుల్ నిర్వహణ ఆర్థిక లావాదేవీల కారణంగా మంగ్య హుస్సేన్ భూమిని ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. అంతేకాక వ్యక్తిగతంగా దుర్భాషలాడుతుండటంతో హుస్సేన్ భార్య విజయ మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ధరావత్ మంగ్య ఆయన భార్య మాజీ సర్పంచ్ మంగమ్మ మరికొంతమంది భూపంచాయతీ, కేబుల్ లెక్కల్లో ఆర్థిక వేధింపులు, కుటుంబ సమస్యలతో వేధిస్తున్నారని హుస్సేన్ భార్య విజయ తన మొబైల్‌లో వీడియో రికార్డింగ్ చేసింది. ఆదివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భర్త హుస్సేన్ ఫిర్యాదు మేరకు పోలీసులు జడ్జి సమక్షంలో బాధితురాలు విజయ వాగ్మూలం తీసుకున్నారు. హుస్సేన్ ఫిర్యాదు మేరకు ధరావత్ మంగ్య భార్య మంగమ్మతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లింగయ్య తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు యువకులకు రిమాండ్

గుర్రంపోడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడిని బీరు బాటిల్‌తో పొడిచి గాయపరిచిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మధు తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రపోండు మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన ఈర్ల నరేష్, కొత్ర సాయి అనే యువకులు ఈ నెల 15వ తేదీన కొప్పోలు బస్టాండ్‌లో మద్యం మత్తులో భాషపాక నవీన్ అనే యువకుడిని బీరు బాటిల్‌తో పొడిచి గాయపరిచారు. అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. వారిని ఆదివారం పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం మత్తులో వ్యసనాలకు అలవాటు పడి ఈ ఘటనకు కారణమైనట్లు ఆయన తెలిపారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు బానిసై ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధు హెచ్చరించారు.

ద్విచక్రవాహనం చోరీ

కొండమల్లేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టపగలే ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించే సంతలో ఆదివారం జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన పోలె అంజయ్య అనే రైతు మేకలను కొనుగోలు చేసేందుకు తన ద్విచక్ర వాహనంపై ఆదివారం కొండమల్లేపల్లి సంతకు వచ్చాడు. ఈ క్రమంలో తన బైక్‌ను సంతలో పార్కింగ్ చేశాడు. మేకలు కొనుగోలు చేసి వచ్చి చూసే సరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో ఎంత వెతికినా బైక్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని కొండమల్లేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హాకీ పోటీలకు నల్లగొండ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన టి. జశ్వంత్, జె. విజయ్, ఎండి. మాజెలు పాల్గొని ఆటలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు వరకు హర్యానా రాష్ట్రం రోహితక్ జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దగ్గుబాటి విమల తెలిపారు. జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను నల్లగొండ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం ఆదివారం అభినందించారు.

కోదాడలో గంజాయి పట్టివేత?

కోదాడరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నట్లు సమాచారం. కారుతో పాటు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుంచి సుమారు పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం నుంచి ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. మండల పరిధిలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. గంజాయి తరలిస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించారు. కానీ కారు ఆగకుండా వెళ్లడంతో పోలీసులు కారును వెంబడించి చిమిర్యాల క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు తెలిసింది.

చిట్టీ పేరుతో మోసం చేసిన భార్యాభర్తల అరెస్ట్

- జెన్‌కో ఉద్యోగులను రూ.93 లక్షలు ఎగవేత
- డబ్బులు ఇవ్వకుండా ఐపీ పెట్టిన దంపతులు

నాగార్జునసాగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసి కోట్లు దండుకున్న జెన్‌కో ఉద్యోగి దంపతులను నాగార్జునసాగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.... నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఆర్టిజన్‌గా పని చేస్తున్న తుర్క శ్రీనివాస్‌రావు, అతని భార్య తుర్క లక్ష్మీపద్మావతి(35)లు కలిసి జెన్‌కోలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఎస్ఈ వరకు 40 మందితో చిట్టీలు వేయించారు. చిట్టీ ఎత్తుకున్న తర్వాత డబ్బులు ఇవ్వకుండా కాలం వెల్లదీస్తున్నారు. అందరికీ ప్రాంసరీ నోట్లు రాసి ఇచ్చారు. జెన్‌కో ఉద్యోగులు 37 మందికి రూ.93.18 లక్షలు ఇవ్వాల్సి ఉండగా డబ్బులు ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వకపోగా డబ్బులు అడగటానికి ఇంటికి వెళితే పెంపుడు కుక్కలను వదలడం, బెదిరించడం వంటివి చేస్తున్నారు. దీంతో ఈ నెల 1వ తేదీన జెన్‌కో ఎస్ఈ రఘురాంతో సహా ఉద్యోగులు అందరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ తుర్క శ్రీనివాస్‌రావును పిలిచి అడగగా నేను ఆర్థికంగా బలహీనపడ్డానని, డబ్బులు ఇవ్వలేనని చెప్పాడు. విచారణలో ఉండగానే ఈ నెల 6వ తేదీ నుంచి చిట్టీలు వేసిన ఉద్యోగులందకీ తన భార్య పేరున ఐపీ పెట్టి కోర్టు నోటీసులను పంపాడు. దీంతో ఉద్యోగులందరూ మరల పోలీసులను సంప్రదించి జరిగిన విషయం తెలియజేశారు. జెన్‌కో ఎస్ఈ రఘురాం ఫిర్యాదు మేరకు సదరు దంపతులపై సెక్షన్ 318(4), 351(2),352, బీఎన్ఎస్ అండర్ సెక్షన్ 4 ప్రైజ్ మనీ అండ్ సర్క్యులేషన్ స్కీం చట్టం 1978 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఏపీకి కారులో పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు

చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసి డబ్బులు ఇవ్వకుండా ఐపీ నోటీసులు పంపిన జెన్‌కోలో పనిచేస్తున్న తుర్క శ్రీనివాస్‌రావు, లక్ష్మీపద్మావతి దంపతులపై కేసు నమోదు చేశారు. శనివారం సాగర్ పైలాన్ కాలనీ కొత్తవంతెన వద్ద సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా దంపతులు కారులో (టీఎస్05 8973) ఆంధ్రప్రదేశ్‌కు పారిపోతున్నారు. కారు ఆపి భార్యాభర్తలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఆశతోనే లక్ష్మీ పద్మావతి తమ్ముడు మహ్మద్ షరీఫ్ సహకారంతోనే చిట్టీల పేరుతో జెన్‌కో ఉద్యోగులు, సాగర్ ప్రజలను సుమారు 50 మందిని నమ్మించి మోసం చేసినట్లు అంగీకరించారు. ఆ డబ్బుతో బంగారం, కారు కొనుగోలు చేశామని దంపతులు ఒప్పుకున్నారు. విచారణ అనంతరం వారి వద్ద నుంచి టాటా నెక్సాన్ కారు, 2సెల్ ఫోన్లు మరియు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకాలను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఈ కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ సంపత్, సిబ్బంది శంకర్ బాబు, గురునాథం, రాంకోటి, జావీద్, శేఖర్, సతీష్, విజయ్‌లను సీఐ బీసన్న, డీఎస్పీ రాజశేఖర్‌రాజు అభినందించారు.

అణువణువునా ఆధ్యాత్మికం

హుజూర్‌నగర్‌లో పలు పురాతన ఆలయాలు ● శివలింగంపై సూర్యకిరణాల ప్రకాశం ● కోటి దీపోత్సవాలు ● మహారుద్రాభిషేకం

హుజూర్‌నగర్ పట్టణం ఆధ్యాత్మికతకు పేరుగాంచింది. పలు పురాతన ఆలయాలు భక్తులను భక్తి పారవశ్యంతో ముంచెత్తుతాయి. కార్తీక మాసంలో శివలింగంపై సూర్య కిరణాలు ప్రసరించడం ఓ విశిష్టత. హుజూర్‌నగర్‌కు సమీపంలో ఒక వైపు కృష్ణా నది, మరోవైపు మూసీనది, ఇంకో వైపు సాగర్ జలాల పరవళ్లు సవ్వడి చేస్తుంటాయి. ఒక వైపు ఆధ్యాత్మికం.. మరో వైపు ఆహ్లాదకర వాతావరణం ప్రజలు సేదతీరు తుంటారు.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)



హుజూర్‌నగర్‌లోని శ్రీపార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి దేవాలయం

చరిత్ర ఇదీ..

హుజూర్‌నగర్ గతంలో పోంచర్ల గ్రామంగా ఉండేదని చరిత్ర చెబుతోంది. పోంచర్ల అంటేనే పోచమ్మతల్లి అని, ఆ గ్రామ దేవత పేరిట గ్రామంగా వర్ధిలింది. నవాబుల కాలంలో హుజూర్ అనే రాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించడంతో పోంచర్ల హుజూర్‌నగర్ మారింది. పోంచర్ల అంటే పోచమ్మతల్లి... పోచమ్మతల్లి అంటే ముత్యాలమ్మతల్లి అని భక్తులు పిలుస్తుంటారు. ఆ ముత్యాలమ్మతల్లికి ప్రతిఏటా హుజూర్‌నగర్ పట్టణంలో శ్రావణమాసంలో మూడు రోజుల పాటు ముత్యాలమ్మతల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీ. దశాబ్దాల కాలంగా శ్రావణంలో గంగమ్మ జాతర అనంతరం పెద్దముత్యాలమ్మ, చిన్నముత్యాలమ్మ, కనకదుర్గదేవిలకు జాతర నిర్వహిస్తున్నారు. పేరు హుజూర్‌నగర్ అయినప్పటికీ వందేళ్ల నుంచి ఇక్కడ పోచమ్మ కొలువుదీరి ఉండంతో పోంచర్లగా ఉన్న ఈ ప్రాంతం చల్లగా ఉండాలని, పాడిపంటలతో తులతూగాలని కోరుతూ ప్రజలు, రైతులు గ్రామదేవతను కొలుస్తున్నారు. ఇక్కడ అనేక కులాలు, మాతాలు ఉన్నప్పటికి ఇక్కడ హిందూ, ముస్లింలు అన్న దమ్ముల్లా కలిసి ఉంటారరు. ఒకరికి ఆపదొస్తే మరొకరు సహకరిస్తారు.

హుజూర్‌నగర్ పట్టణంలో కాకతీయుల కాలం నాటి శ్రీపార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి-శ్రీవేణుగోపాలస్వామి దేవాలయాలు ఉన్నాయి. భీమలింగేశ్వరస్వామి దేవాలయాన్ని పునర్నిర్మాణం చేశారు. హుజూర్‌నగర్ మండలంలో బూరుగడ్డ గ్రామంలో శ్రీఆదివరాహ లక్ష్మీ నర్సింహ వేణుగోపాలస్వామి ఆలయం, బూరుగడ్డలోని శ్రీనల్ల కట్ట సంతాన ఇష్టకామేశ్వరీ సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయం ప్రసిద్ధికెక్కాయి.



కనకదుర్గ ఆలయంలో అమ్మవారు



ఏకశిల అనంతపద్మనాభస్వామి విగ్రహం

పురాతన కాలంనాటి అమరవరం గ్రామంలో అమరలింగేశ్వరస్వామి ఆలయం. లింగగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాలు నిత్యం దీప, ధూప, నైవేద్యాలతో విరాజిల్లుతున్నాయి. కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో లక్ష రుద్రాక్షలతో అభిషేకాలు, కోటి దీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఐదు శతాబ్దాల నాటి శ్రీకనదుర్గదేవాలయంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నారు. మండలంలోని బూరుగడ్డ శివాలయంలో కార్తీక మాసంలో లక్ష రుద్రాభిషేకం కోటి దీపోత్సవం, నిర్వహించడంతో పాటు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ధనుర్మాసం సందర్భంగా పురాతన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించే శోభాయాత్రకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ఎనిమిది వాహనాలపై శ్రీవేణుగోపాలస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, గోదాదేవి అమ్మవారు, ఆంజనేయస్వామి, విఖానస ముని, రామానుజ స్వామి, చక్కర పెరుమాళ్లతో ఊరేగింపు నిర్వహిస్తుంటారు. పట్టణంలోని కనకదుర్గ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అదేవిధంగా మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఫణిగిరి గట్టుపై శ్రీసీతారామచంద్రస్వామి వారం రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు.



బూరుగడ్డ శంభులింగేశ్వరస్వామి ఆలయం

సూర్యకిరణాలు ప్రసరించే పురాతన శివాలయం

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని పురాతన శివాలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ దేవాలయంలో కార్తీకమాసం మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఆరు గంటల పాటు సూర్యకిరణాలు ప్రసరించడం ఓ ప్రత్యేకత. ఈ ఆలయాన్ని 2012లో పునర్నిర్మాణం చేశారు. ఆనాటి నుంచి సూర్యభగవానుడు తన కిరణాలత శివలింగానికి అభిషేకం చేస్తున్నట్లు అర్చకులు తెలిపారు. భృగు మహర్షి తపస్సు చేసిన ప్రాంతం అయినందున, ఆయన పేరిట బూరుగడ్డగా ఆ గ్రామం ప్రసిద్ధికెక్కింది.

బూరుగడ్డ గ్రామంలో ఆదివరహ,శ్రీలక్ష్మీనర్సింహ శ్రీవేణుగోపాల దేవాలయంలో ఒకే పీఠంపై ముగ్గురు దేవతామూర్తులు కొలువుదీరడం ప్రత్యేకత. అదే దేవాలయంలో 24అడుగుల ఏకశిల అనంతపద్మనాభస్వామి విగ్రహం ఉంది. ఈ దేవాలయాన్ని. కాకతీయ సత్రం బొల్లంరాజు ఈ దేవాలయాన్ని నిర్మించారు మండలంలోని అమరవరంలో అమరలింగేశ్వస్వామి ఆలయం ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ ఆలయంలో ఇటీవల మహారుద్రాభిషేకం నిర్వహించారు.

హుజూర్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని అనేక గ్రామాల్లో వైష్ణవాలయాలు, శివాలయాలు ఉన్నాయి. కాగా శ్రావణ మాసంలో ముత్యాలమ్మ జాతరలు, కార్తీకమాసం కోటి దీపోత్సవాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తుంటారు. మాఘశుద్ధ పౌర్ణమిలో రాములోరి బ్రహ్మోత్సవాలు, శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలతో నిత్యకల్యాణం.. పచ్చతోరణంలా ఆ ప్రాంతం ఆధ్యాత్మికతో అలరారుతోంది.

ఆధ్యాత్మికతకు మారుపేరు హుజూర్‌నగర్



హుజూర్‌నగర్ అంటేనే ఆధ్యాత్మిక ప్రాంతం. పురాతన శివాలయం, రామాలయం, వందల ఏళ్ల కనకదుర్గ దేవాలయం ఇలా ఎన్నో విశిష్టతలతో ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచింది. ఇక్కడి దేవాలయాల్లో శ్రావణమాసం, కార్తీకమాసం, ధనుర్మాసంలో నిర్వహించే నిత్య పూజలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తాయి. ఫణిగిరిగట్టుకు ఎంతో చరిత్ర ఉంది. స్వయంభువుగా శ్రీసీతారామచంద్రస్వామి కొలువుతీరిన ప్రాంతమిది. ఒక్కో దేవాలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది.

● నరగిరినాథుని రంగభట్రాచార్యులు, అర్చకుడు, కనకదుర్గ దేవాలయం, హుజూర్‌నగర్

సమాచారం

నేడు ఎమ్మెల్యే రాక

నూతన్‌కల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే మందుల సామేలు సోమవారం రానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోదాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లబండగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్‌లో ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ రూరల్ ఏఈ సైదా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లబండగూడెం, చిమిర్యాల గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలపై నిరంతరం పోరాటం

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కమిటి సభ్యుడు భూక్య పాండునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యవసర ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఈనెల 29న జరిగే సీపీఎం తృతీయ మహాసభలలో పలు సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించి పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, సీనియర్ నాయకులు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సయ్యద్ రస్‌మియా, వెంకటరెడ్డి, హర్యానాయక్, తిరపతయ్య, పి.రాము పాల్గొన్నారు.

బాల్సన్‌నాయక్‌కు అవార్డు



బాల్సన్‌నాయక్‌కు అవార్డు అందజేస్తున్న కోదండరాం

పాలకవీడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాన్ ఇండియా అవార్డు ను మండలంలోని కల్మెట్ తండాకు చెందిన గిరిజన నాయకుడు దరావత్ బాల్సన్‌నాయక్ అందుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రచారాలు నిర్వహించినందుకు ఆదివారం హైదరా బాద్‌లోని బిర్లా సైన్స్ భాస్కర ఆడిటోరియంలో బాల్సన్ నాయక్‌కు పాన్‌ఇండియా అవార్డును ఎమ్మెల్సీ కోదండరాం అందజేశారు. బాల్సన్‌నాయక్‌కు అవార్డు రావడంపై గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కార్తీక వనభోజనాలతో ఆధ్యాత్మికత



చిలుకూరులో పూర్ణకుంభంతో వనభోజనాలకు వెళ్తున్న మహిళలు

కోదాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస వన భోజనాలతో ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతాభావం పెరుగుతుందని అధికారి సిలివేరు వెంకటేశ్వర్లు, నాయకులు మామిడి రామారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కొమరబండ గ్రామంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వనభోజనం కార్తీకమాస పూజా విధుల్లో ముఖ్యమైందన్నారు. అనంతరం ఉసిరి, అశ్వత్థ, బిల్వ తదితర వృక్షాల నీడలో సామూహికంగా భోజనం చేశారు. ముందుగా 9వ వార్డు కౌన్సిలర్ మామిడి పద్మ ఆధ్వర్యంలో గ్రామంలో కార్తీకమాస వనభోజనాలకు కుమ్మర కుటుంబ సభ్యులు ఊరేగింపుగా అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు మామిడి జానకిరామారావు, కొలిపాక రామలింగం, కడారు మల్లయ్య గొల్లపల్లి రాజయ్య, చుక్కయ్య కొలిపాక రామకృష్ణ, ఉడుం రాజేష్, మట్టయ్య, కుమ్మరి సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చిలుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం కాకతీయ కమ్మ సంఘం వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కొత్త చిలుకూరులోని రామాలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పూర్ణకుంభంతో వన భోజనాలకు వెళ్లారు. గ్రామంలో బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించి ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. వనభోజనాల సందర్భంగా పలువురు ప్రముఖులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి, చిలుకూరు కమ్మసంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...



సూరిబాబు

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సూరిబాబు..చిలుకూరు: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మల్లెపంగు సూరిబాబును ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వేముల అశోక్, కార్యదర్శిగా కందుకూరి రామారావు, అధికార ప్రతినిధిగా వేముల భార్గవ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి కోటేష్, కందుకూరి సోమన్న, బోడ సునిల్ పాల్గొన్నారు.



జానకిరాములు

టీయూటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జానకిరాములు.. సూర్యాపేట టౌన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మఠంపల్లి మండలం వరదాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉట్కూరి జానకిరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన మహాసభలో జానకిరాములును ఎన్నుకున్నారు

పద్మశాలి సంఘం సమావేశం.. సూర్యాపేట టౌన్: సూర్యాపేట పద్మశాలి సంఘం అత్యవసర సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని మిట్టకోల భవనంలో ఆ సంఘం అధ్యక్షుడు మిట్టకోల సతీష్‌కుమార్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశ పెట్టారు.

గడ్డివాము దగ్ధం.. సూర్యాపేటరూరల్: మండలంలోని యర్కారం గ్రామానికి చెందిన కట్లెబోయిన వీరయ్య కు చెందిన మూడు ఎకరాల్లోని 150 కట్టల గడ్డికి ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమైంది. గడ్డి విలువ రూ.20 వేలు ఉంటుందని రైతు తెలిపారు.

పేదల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

సూర్యాపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ న్యాయమైనదని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఆయన నాయకత్వంలో న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మాదిగల సమాలోచన జిల్లా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరు అడ్డంకులు సృష్టించినా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ ఆగదన్నారు. వర్గీకరణ పోరాటం మూడు దశాబ్దాల నుంచి జరుగుతుందని, వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ ద్వారా పేద దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగానే వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ప్రకటన చేసిన గొప్ప సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. మాదిగలు డప్పులు కొట్టడం, చెప్పులు కుట్టడంతో పాటు మిలటరీ జవాన్లకు బూట్లు తయారు చేసిన చరిత్ర ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును మాలలు గౌరవించాలని విజ్ఞప్తిచేశారు. వర్గీకరణ అమలుకోసం ప్రభుత్వం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చైర్మన్‌గా,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్క సభ్యులుగా కమిటీని నియమించిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, సీనియర్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిలను కలిసి కోరతానన్నారు. ఈ సమావేశంలో తిరుమలగిరి, నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్లు అనసూయ, బచ్చలకూరి ప్రకాష్, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, నాయకులు రెబల్ శ్రీను, వల్దాస్ దేవేందర్, చిప్పలపల్లి జయశంకర్, గుడిపాటి సైదులు, కడియం పరమేష్, దాసరి శ్రీను, పాలడుగు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం



హుజూర్‌నగర్‌లో సీపీఎం జెండాలను ప్రదర్శిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డుల మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. సబ్సిడీ గ్యాస్ అందించాలని, రేషన్‌కార్డులు మంజూరుచేయాలని కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 29 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వేణు, శ్రీను, అన్నపూర్ణ, సైదులు, రాము, వెంకటయ్య, సావిత్రి, నాగమణి, కల్పన, రేణుక, కార్తీక్, కోటయ్య, వీరయ్య, తిరపయ్య, సుభద్ర, ప్రియాంక పాల్గొన్నారు.

'మొల్ల విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకోవడం తగదు'

నూతన్‌కల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొదటి కవయిత్రి మొల్ల విగ్రహాన్ని నల్లగొండ జిల్లా హాలియా మండల కేంద్రంలో ప్రతిష్ఠించకుండా అడ్డుకోవడం తగదని బీసీ విద్యార్థి యువజన సంఘం జిల్లా నాయకుడు కొలిచెల్మ తరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విగ్రహ ప్రతిష్ఠకు మునిసిపాలిటీ అధికారులు అనుమతులు ఇచ్చిన తర్వాతనే గద్దె నిర్మించినట్లు తెలిపారు. తర్వాత అనుమతులు లేవని గద్దెను కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో శనగల రమేష్, కొలిచెల్మ సాయిసిద్దార్థ, అనంతుల విజయ్, పిల్లలమర్రి సాయి, కుంచం మహేష్ తదితరులు ఉన్నారు.

మునిసిపాలిటీలో విలీనం చేయొద్దు



తొండ గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తిరుమలగిరి రూరల్ నవంబరు 17: మండలంలోని తొండ గ్రామాన్ని తిరుమలగిరి మునిసిపాలిటీలో విలీనం చేయొద్దని ఆ గ్రామ అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న తొండ గ్రామాన్ని గ్రామాన్ని మునిసిపాలిటీలో చేర్చి అభివృద్ధిని అడ్డుకోవద్దని, గ్రామంలో వేలాది మంది ఉపాధి కూలీ మీదనే ఆధారపడి జీవిస్తున్నారని, మునిసిపాలిటీలో విలీనం చేస్తే ఉపాధి కోల్పోయి పస్తులు ఉండాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభ్యుదయ కమిటీ అధ్యక్షుడు నీరటి ప్రవీణ్, ఏసీరెడ్డి, భిక్షపతి, రమేష్, కృష్ణయ్య, వెంకన్న, సాయికుమార్, కాంగ్రెస్ నాయకుడు నాగరాజు, వి.వెంకన్న, వి.నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు జి.మల్లయ్య, రవి, సైదులు, సురేష్, సీపీఎం కార్యదర్శి వెంకటయ్య, సోమయ్య, బీజేపీ నాయకుడు వి.నరేష్, గ్రామ పెద్దలు కోటయ్య, ఉప్పలయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

నూతన కార్మిక చట్టాలను రద్దుచేయాలి



సీపీఎం మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నూతన కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో సీపీఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో నూతన కార్మిక చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరగనుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారన్నారు. మోడీ మతతత్వ విధానాలను వ్యతిరేకించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలన్నారు. సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో వీరయ్య, వెంకన్న, తిరపయ్య, సావిత్రి, మిన్నమ్మ, సుభద్ర, ప్రియాంక, మట్టమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్లు పెంచాలి



హుజూర్‌నగర్‌లో నివాదాలు చేస్తున్న పి.బాబు, దివ్యాంగులు

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో దివ్యాంగుల పింఛన్లు పెంచాలని ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి పి.బాబు, పొనుగుపాటి లక్ష్మణ్‌రావు, కాలం శ్రీనివాసు కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ పింఛన్లు పెంచకపోవడం సరైన విధానం కాదన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పిచ్చయ్య, పుల్లయ్య, శ్రీను, కనకయ్య, వీరబాబు, రాకేష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీతను ఆచరించాలి



మాచనపల్లిలో ప్రచారం చేస్తున్న, సభ్యులు, స్వాములు

నూతన్‌కల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీతను ఆచరించి మంచిని ప్రేరేపించాలని ధర్మజాగరణ సమితి, హిందూ చైతన్య రథయాత్ర సభ్యులు ఎలిపెద్ది పాపిరెడ్డి, గురుస్వామి సురిగి మల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మాచనపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాండ్లపల్లి నాగేశ్వరాచారి, బొల్క కొమరయ్య, గుండాల నాగయ్య, కొంపెల్లి ఎల్లయ్య, బొల్క గురప్ప, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దిరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాగుడు మానేయాలని మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు , కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన చెవిటి మల్లయ్య తాగుడుకు బానిసయ్యాడు. దీంతో ఆయన తరచుగా అనారోగ్యానికి గురవుతున్నాడు. ఆరోగ్యం బాగలేనందున తాగుడు మానాలని ఈ నెల 14వ తేదీన అతని భార్య సత్తమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లయ్య అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు మల్లయ్యకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వీరసోములు తెలిపారు.

గ్రామాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

కోదాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధిపై ఆదివారం మండలంలోని గుడిబండ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల సహకారంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, విద్యుత్ సమస్య పరిష్కారం, పింఛన్లు, పోస్టల్‌లో జీవిత బీమా కల్పించే విధంగా పనిచేద్దామన్నారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామంలో 10 మందితో కమిటీ వేసినట్లు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ రఫీ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఇర్ల నర్సింహారెడ్డి, తూమాటి నాగిరెడ్డి, నరోత్తమరెడ్డి, పులి రాజారావు, ఎండీ హసన్‌అలీ, మాదాసు నాగరాజు, సిద్దయ్య, ప్రేమ్‌చంద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.